# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. దసరా సందర్భంగా ప్రజలకు తెలుగు రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

2. ఇసుకను నేరుగా రీచ్‌కి వెళ్లి కొని తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.

3. తెలంగాణలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు.

4. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతుబజార్లలో నిత్యావసర సరుకులు విక్రయించాలని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

5. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మ అమ్మవారు ఈ తెల్లవారుజాము నుంచి రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు.

=========================

దసరా సందర్భంగా రాష్ట్ర ప్రజలకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారికి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. ధర్మంపై ఆధిపత్యం, చెడుపై మంచి విజయానికి ప్రతీకే దసరా అని అని ఆయన పేర్కొన్నారు. శాంతి, సౌభ్రాతృత్వంతో ప్రజలంతా కలిసిమెలసి జీవించాలన్నదే దసరా పండుగ సందేశమని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విజయదశమిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. శాంతియుత, అభివృద్ధికారక సమాజం కోసం కృషి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. విజయదశమిని పురస్కరించుకుని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండగ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి నిన్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణకు నిత్య విజయాలు కలగాలని, ప్రజలకు సుఖసంతోషాలు ప్రసాదించాలని దుర్గామాతను ప్రార్థిస్తున్నా అని పేర్కొన్నారు.

-------------------------

ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవడమే కాకుండా, నేరుగా రీచ్‌కి వెళ్లి కొని తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. నిన్న ఆయన రాష్ట్ర సచివాలయంలో గనులశాఖ మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి రాష్ట్రంలో ఇసుక లభ్యతపై సమీక్ష నిర్వహించారు. వీలైనన్ని ఎక్కువ రీచ్‌లలో ఇసుక తవ్వకాలుప్రారంభించడం ద్వారా, ఇసుక కొరత లేకుండా చూడవచ్చుని పేర్కొన్నారు.

ఈ నెల 16 నుంచి అనుమతులున్న అన్ని రీచ్‌లలో ఇసుక తవ్వకాలు మొదలుపెట్టాలని ముఖ్యమంత్రి తెలిపారు.

---

తెలంగాణలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొందుర్గులో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో పాఠశాలను 25 కోట్ల రూపాయలతో 150 ఎకరాల్లో నిర్మిస్తున్నట్టు చెప్పారు. విద్యార్థులకు నైపుణ్యాలతో కూడిన విద్యను అందించేందుకే సమీకృత పాఠశాలల నిర్మాణం చేపట్టినట్లు ముఖ్యమంత్రి వివరించారు.

---

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతుబజార్లలో నిత్యావసర సరుకులు విక్రయించాలని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. నిన్న విజయవాడ పటమట, గురునానక్ కాలనీలోని రైతు బజార్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యావసరాల ధరలు పెరగడంతో ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం కొంత ఖర్చు భరించి రాయితీపై వాటిని అందిస్తోందని వెల్లడించారు. పామాయిల్ లీటరు 110 రూపాయలకు, సన్‌ఫ్లవర్ ఆయిల్ 124 రూపాయలకు విక్రయించాలని, వినియోగదారులకు కనబడేలా సూచికలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.

---

తెలంగాణలో విద్య, వైద్య రంగాల్లో మార్పులు తెచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం గోవిందాపురంలో యంగ్ ఇండియా సమీకృత పాఠశాల సముదాయ నిర్మాణ పనులకు నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రపంచస్థాయి ప్రమాణాలతో విద్యార్థులకు భోదన అందిస్తామని.. అన్ని సదుపాయాలతో సమీకృత పాఠశాలలను నిర్మిస్తామని అన్నారు. వీటి కోసం 5వేల కోట్ల రూపాయలను కేటాయించామని ఉపముఖ్యమంత్రి తెలిపారు.

---

ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మ అమ్మవారు ఈ తెల్లవారుజాము నుంచి రాజరాజేశ్వరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. కాగా.. ఈ మధ్యాహ్నం పూర్ణాహుతి, సాయంకాలం నిర్వహించే తెప్పోత్సవంతో శరన్నవరాత్రి ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి.

దసరా ఉత్సవాలు తొమ్మిదోరోజు శ్రీశైల భ్రమరాంబిక దేవి సిద్ధిదాయని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు.

---

తెలంగాణలో సమగ్ర కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా సమగ్ర ఇంటింటి కుటుంబ గణన చేపట్టనున్నట్లు తెలిపింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల అంశాలపై గణన చేయనున్నట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ.శాంతికుమారి వెల్లడించారు. ప్రణాళికశాఖ సర్వేను

నిర్వహిస్తుందని 60 రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మరోవైపు తెలంగాణలో షెడ్యూల్డ్ కులాలు–ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ అధికారిగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ప్రభుత్వం నియమించింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరిలో ప్రధాన క్రీడా కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో క్రికెట్ అకాడమీలను ప్రారంభిస్తామని ఆంధ్ర క్రికెటర్ అసోసియేషన్ అధ్యక్షులు, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిన్న నిర్వహించిన ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ –2024 విజేతలకు బహుమతి ప్రధాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ–శాప్ ఆధ్వర్యంలో డిసెంబర్ 1వ తేదీ నుంచి జనవరి 15వ తేదీ వరకు అన్ని క్రీడలకి సంబంధించి టోర్నమెంట్స్ నిర్వహిస్తామని చెప్పారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నిన్న రాత్రి స్వామి వారు అశ్వ వాహనంపై కల్కి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ఈరోజు చివరి రోజు. ఈ ఉదయం స్వామివారికి చక్రస్నానం నిర్వహించనున్నారు. ఈ సాయంత్రం నిర్వహించే ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

---------------------------

తెలంగాణలో ఇళ్ల లబ్దిదారులను ఎంపిక చేసేందుకుగాను ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై ఆ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీ, మున్సిపల్, వార్డు స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేరొంది. గ్రామస్థాయిలో సర్పంచి లేదా ప్రత్యేక అధికారి, మున్సిపాలిటీ స్థాయిలో కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ ఛైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. పంచాయతీ కార్యదర్శి లేదా వార్డు అధికారి ఇందిరమ్మ ఇళ్ల కమిటీ కన్వీనర్‌గా ఉంటారని జీవోలో ప్రభుత్వం పేర్కొంది. అధికారులతో సమన్వయం చేసుకుంటూ కొనసాగనున్న ఈ కమిటీలు.. ఇందిరమ్మ ఇళ్లపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తాయని తెలిపింది. ఈమేరకు ఈ సాయంత్రం లోపు ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.

---------------------------

వారం వారం ప్రపంచవ్యాప్తంగా జరిగిన వార్తల విశేషాలు, వివిధ అంశాల సమాచారంతో అంతర్జాతీయ విషయాలన్నింటిని తెలుగులో అందించేందుకు ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన వసుధైక కుటుంబం ప్రత్యేక కార్యక్రమం ఈ ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

తెలంగాణలో వైద్య ఆరోగ్య శాఖలో 371 పోస్టుల భర్తీకి వైద్య నియామక బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. గత నెలలో విడుదల చేసిన ఫార్మసిస్ట్, నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌కి అనుబంధంగా ఈ నోటిఫికేషన్ విడుదల చేసినట్టు బోర్డు తెలిపింది. గత నెలలో 2 వేల 50 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు ఇచ్చిన

నోటిఫికేషన్‌కు ఇప్పుడు అదనంగా మరో 272 పోస్టులను, గతంలో ప్రకటించిన 633 ఫార్మసిస్ట్ పోస్టులకు అదనంగా మరో 99 పోస్టులను కలుపుతూ తాజాగా మరో నోటిఫికేషన్ జారీ చేసింది. నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఫార్మసిస్ట్ పోస్టులకు సంబంధించి ఈ నెల 21 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నామని నియామక బోర్డు తెలిపింది.

---------------------------

ప్రతి మహిళా తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించినప్పుడే నిజమైన మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్  ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. నిన్న విజయవాడలో జరిగిన నారీ శక్తి విజయోత్సవ వేడుకల్లో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరితోపాటు దేశ, విదేశాల్లో ఉన్న తెలుగు ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. దసరా అంటే మహిళా శక్తికి నిదర్శనమని, స్త్రీ శక్తి గొప్పతనాన్ని తెలియజేస్తుందన్నారు. ఈ సందర్భంగా విజయవాడలో ఇటీవల వచ్చిన వరదల విపత్తులను ధైర్యంగా ఎదుర్కొన్న 9 మంది మహిళలను భువనేశ్వరి అభినందించారు.

---------------------------

ఈ రోజు  జాతీయ మానవహక్కుల పరిరక్షణా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. మానవ హక్కులను పరిరక్షించి....పెంపొందించడం కోసం 1993వ సంవత్సరం అక్టోబర్ 12 వ తేదీన దేశంలో జాతీయ మానవ హక్కుల సంఘం ఏర్పాటయింది. మానవ హక్కుల అతిక్రమణ ఏ రూపంలో జరిగినా... వాటిని గుర్తించి... విచారణ జరిపి బాధితులకు తగిన న్యాయం చేయడం ఈ సంస్థ ప్రధాన లక్ష్యం.

======================